క్లుప్తంగా

పోక్సో యాక్ట్‌పై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఆరవ అదనపు జిల్లా జడ్జి పి.పాండు రంగారెడ్డి

కర్నూలు సిటీ: నగర శివారులోని పంచలింగాల సమీపంలో ఉన్న ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరవ అదనపు జిల్లా జడ్జి పి.పాండు రంగారెడ్డి మాట్లాడుతూ 2012 రక్షణ చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పోక్సో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టులు ఉన్నాయన్నారు. సదస్సులో ఆ స్కూల్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో చలి వేంద్రాల ఏర్పాటు



చలి వేంద్రం వద్ద దాహం తీర్చుకుంటున్న రైతులు, కార్మికులు

కర్నూలు(అగ్రికల్చర్): ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి వాటిని ప్రారంభించి మాట్లాడారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో కార్మికులు, రైతులు ఇతర అన్ని వర్గాల ప్రజల కోసం మూడు చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కోడుమూరు కోఆర్డినేటర్‌గా అనంతరత్నం



కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా అనంతరత్నం మాదిగను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆదేశాలు జారీ చేశారు. ఇంతవరకు కోడుమూరు ఇన్‌చార్జ్‌గా పి.మురళీకృష్ణ ఉండేవారు. ఆయనను తొలగించి అనంతరత్నం మాదిగను నియమించారు. ఈనేపథ్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతారో లేదో చూడాల్సి ఉంది.

నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో ఈ నెల 18వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. విద్యుత్‌కు సంబంధించిన అభివృద్ధి పనులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. షరాప్ బజారు, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, పోస్టాఫీసు, కాంగ్రెస్ ఆఫీసు, దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూలు, వడ్డెగేరి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సోమ వారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.

కదం తొక్కి..గళమెత్తి

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- సమస్యలపై ఆందోళన బాట పట్టిన వివిధ వర్గాల ప్రజలు
- ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన
- మద్దతు తెలిపిన వివిధ ప్రజా, విద్యార్థి సంఘాలు
- డీఎస్సీ పేరుతో బాబు నమ్మించి మోసం చేశారన్న నిరుద్యోగులు
- కౌలు రైతులను ఆదుకోవాలని నినదించిన ఏపీ రైతు సంఘం

కార్మికులు, కర్షకులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఇలా వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యలపై కదం తొక్కారు. సోమవారం కలెక్టరేట్‌కు చేరుకొని నిరసనలతో హోరెత్తించారు. డీఎస్సీ పేరుతో సర్కారు నమ్మించి మోసం చేసిందని నిరుద్యోగులు, తమ గోడు పట్టించుకోవడం లేదని డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఫీల్డ్ ఉద్యోగులు, గుర్తింపు కార్డులిచ్చి రుణాలివ్వాలని కౌలు రైతులు, తమ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నగరంలోని బీవీరెడ్డి కాలనీవాసులు గళమెత్తారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. –కర్నూలు(సెంట్రల్)



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వైద్యసేవ ఉద్యోగులు



డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు



ధర్నా చేస్తున్న ఏపీ కౌలు రైతుసంఘం నాయకులు

తొలిసంతకం ఇంకెప్పుడు?

అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేస్తానని ప్రకటించి చంద్రబాబు మోసం చేశారని నిరుద్యోగులు మండిపడ్డారు. వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఏఐవైఎఫ్‌జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి పదినెలలవుతున్నా తొలి సంతకానికి మోక్షం లేదన్నారు. విద్యాశాఖమంత్రి లోకేష్ అదిగో..ఇదిగో డీఎస్సీ అంటూ ప్రసంగాలు చేస్తున్నారే తప్ప నోటిఫికేషన్ ఇవ్వడం లేదన్నారు. కూటమి సర్కారు మాటలకు చేతలకు పొంతన లేదని విమర్శించారు. ఉద్యోగాలు భర్తీ చేసే వరకు ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు.

కౌలు రైతు గోడు పట్టదా?

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీలేని రుణాలు ఇవ్వాలని ఏపీ రైతుసంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.కౌలుదారులకు అన్నదాత సుఖీభవా కింద రూ.20 వేలు సాయంతో పాటు ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నగర శివారులోని జోహరాపురం సర్వే నంబర్ 154లో ఉన్న వక్ఫ్‌బోర్డు భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఇన్సాఫ్ జిల్లా నాయకులు అన్వర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం పేద ముస్లింలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు , దేవిబాయ్, ఆశాబేగం, సోఫియా, శ్రీనివాసులు, శివ, డప్పు బద్రీ, రాజేష్, బీమిరెడ్డి, శీను, రాజన్న, పురుషోత్తం పాల్గొన్నారు.

కాలనీలో కాలువలు నిర్మించాలి

నగరంలోని బీఆర్ రెడ్డి కాలనీలో పాడైనా కాలువల స్థానంలో కొత్తవాటిని నిర్మించాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. పీపీఎస్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. కాలనీలో రోడ్లన్నీ పాడవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. కార్యక్రమంలో పీపీఎస్ఎస్ నాయకులు జహీదాబేగం, పి.శేషు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూములు ఇచ్చిన రైతులకు పరిహారమివ్వాలి

ఓర్వకల్ మండలంలోని పరిశ్రమల హబ్‌కు ముచ్చుమర్రిఎత్తిపోతల పథకం నుంచి నీటిని సరఫరా చేస్తున్న పైప్‌లైన్‌కు భూములు ఇచ్చిన రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన వ్యక్తం చేసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రమిచ్చారు.

మెడికవర్ హాస్పిటల్‌ను సీజ్ చేయాలి

శవాలకు చికిత్స చేస్తున్న మెడికవర్ హాస్పిటల్‌ను సీజ్ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆపార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మెడికవర్ హాస్పిటల్‌లో జరిగిన ఆరోగ్య శ్రీ వైద్య సేవలపై విచారణ జరపాలని, ప్రజల ఆరోగ్యంతో వారు చెలగాటమాడుతున్నారని ఆరోపించారు.



పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పేద ముస్లింలు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పీపీఎస్ఎస్ నాయకులు

డిమాండ్ల సాధన కోసం

కర్నూలు(హాస్పిటల్): తమ డిమాండ్ల సాధన కోసం డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఫీల్డ్ ఉద్యోగులు సోమవారం విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. వీరికి ఏఐటీయూసీ నాయకులు మనోహర్ మాణిక్యం, మునెప్ప మద్దతు పలికారు. డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యమిత్ర, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. నాగరాజు, జిల్లా అధ్యక్షుడు కంబగిరి మాట్లాడుతూ తాము 17 సంవత్సరాలుగా పనిచేస్తున్నా కేడర్ అమలు చేయడం లేదన్నారు. ఈ కారణంగా ఎంటీఎస్ లేక ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగిగా గుర్తింపు లేక రాష్ట్ర ఫీల్డ్ ఉద్యోగులు, వైద్యమిత్రలు, టీంలీడర్లు, జిల్లా మేనేజర్, ఆఫీస్ అసోసియేట్స్, సీసీ డీఈవోలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ ఉద్యోగి చనిపోయిన కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్‌రెడ్డిలకు వినతి పత్రాలు అందజేశారు. యూనియన్ నాయకులు మనోహర్, కె.దేవేంద్రనాయక్, జి. రాజశేఖర్‌రెడ్డి, ఆర్. రమేష్‌బాబు, టి. సుధాకర్‌బాబు, ఎండి. అయూబ్, మహబూబ్ గౌస్, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(సెంట్రల్): సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దని, పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి కలెక్టర్ .రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య వినతు లు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పత్తికొండ ఆర్‌డీఓ దగ్గర 10, ఆదోని సబ్ కలెక్టర్ దగ్గర 16, కర్నూలు ఆర్‌డీఓ దగ్గర 15, డీఎస్ఓ దగ్గర 3, సర్వే ఏడీ 2, డీఆర్‌డీఏ పీడీ2,జిల్లా పరిషత్ సీఈఓ, డీఎంహెచ్, డీపీఓ, గిరిజన సంక్షేమ శాఖ, పీసీబీ, జిల్లా రిజిస్ట్రార్, హౌసింగ్ పీడీల దగ్గర ఒక్కో అర్జీ పెండింగ్‌లో ఉందని వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారాన్ని కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. కృష్ణగిరి తహసీల్దార్ వద్ద 43, కర్నూలు ఆర్‌డీఓ 37, పత్తికొండ ఆర్‌డీఓ 12, ఓర్వకల్ తహసీల్దార్ 9, మిగిలిన మండలాల్లో కూడా సింగిల్ డిజిట్‌లో అర్జీలు పెండింగ్‌లో ఉన్నా యని చెప్పారు. కాగా, సచివాలయాల ద్వారా జరిగే వివిధ రకాల సర్వేలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీకే వెంకటే శ్వర్లు పాల్గొన్నారు.

నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత

కర్నూలు (టౌన్) : నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం సాయంత్రం సంస్థ నూతన కౌన్సిల్ హాలులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రిసోర్స్ పర్సన్లతో కమిషనర్ సమావేశమై మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్ బ్యాక్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే బాధ్యత రిసోర్స్ పర్సన్లదేనన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ క్రిష్ణ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, టీఎంసీలు సుధాకర్ పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ఫీడ్ బ్యాక్ ఇవ్వండి

కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో స్వచ్ఛత పనులకు సంబంధించి పది ప్రశ్నలకు నగర ప్రజలు తమ జవాబులు తెలియజేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా నగరాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్యం, స్థితిగతులపై కేంద్ర ప్రభుత్వం పరిశీలించి ర్యాంకులు ప్రకటిస్తుందని తెలిపారు. నగరం ప్రారంభంలో 221 ర్యాంకులో ఉందని, ప్రజలందరి భాగస్వామ్యంతో పురోగతి సాధించుకుంటూ గత సంవత్సరానికి 32 వ ర్యాంకుకు చేరుకుందని తెలిపారు. అయితే, ఈ ఏడాది సింగిల్ డిజిట్ ర్యాంకు సాధించాలనే సంకల్పానికి నగరంలోని ప్రతి పౌరుడి సహకరించాలన్నారు. ఇందు కోసం స్వచ్ఛ సర్వేక్షన్ వెబ్‌సైట్ htt pr://rbmurban.orf/feed back ను ఓపెన్ చేసి పారిశుద్ధ్యానికి సంబంధించిన పది ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలని తెలిపారు. కర్నూలును శుభ్రతలో జాతీయ స్థాయిలో తొలిస్థానంలో నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ ఫీడ్ బ్యాక్ నమోదు చేయాలని కమిషనర్ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్) : నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగపాలక సంస్థలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మం నిర్వహించారు.ఇందులో కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 12 ఆర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

➤ నగర శివారులోని ఉల్చాల రోడ్డులో ఉన్న వంశీ హోమ్స్‌లో నివసించే తాము వీధి దీపాల విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని, నగరపాలక సంస్థ చెల్లించే విధంగా మార్పు చేయాలని కొండయ్య, నాగేంద్ర, దస్తగిరి, రాధ కమిషనర్‌కు విన్నవించారు.

➤ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టాలని గురుకుల్ పాఠశాల సమీపంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన షాషావలి, ఖాదర్, శ్రీనివాస్‌లు కోరారు.

➤ ఓమెగా హాస్పిటల్ సమీపంలోని కృష్ణజీరావు కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించి, రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు నాగరాజు, వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.

➤ ఇంటి వద్ద పేరుకుపోయిన పూడికతీత వ్యర్థాలను తొలగించాలని మేడం వారి వీధికి చెందిన రాజన్‌బాబు కోరారు.

హంద్రీ వెంట రోడ్డు నిర్మించాలి



ముజఫర్‌నగర్‌లో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: హంద్రీ కాలువ వెంట రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సాయిబాబా, కె. సుధాకరప్ప డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సోమవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో పర్యటించారు. హంద్రీ కాలువలో విపరీతంగా కంపచెట్లు పెరిగాయని తెలిపారు. అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కాలనీలోని మురుగు కాలువలో చేరుతుండడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని ముజఫర్‌నగర్‌లోని ఐఎంఎల్ డిపో నుంచి కల్లూరు హంద్రీ బ్రిడ్జి వరకు మురుగు కాలువ నిర్మించి రోడ్డు వేయాలన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి

కర్నూలు: కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన పచ్చని పంట పొలాల మధ్య ఏర్పాటు చేసిన రేణుక ఎల్లమ్మ మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించి లైసెన్స్‌ను రద్దు చేయాలని సీపీఐ ప్రతినిధి బృందం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావుకు వినతి పత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు జగన్నాథం, కల్లూరు మండల నాయకులు శ్రీనివాసరావు, పుల్లన్న, దొడ్డిపాడు మహమ్మద్ బాషా తదితరులతో కూడిన ప్రతినిధి బృందం సోమ వారం అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సుమారు మూడు ఎకరాల స్థలంలో ఎల్లమ్మ వైన్స్ పేరుతో దుకాణం ఏర్పాటు చేసి ఎలాంటి సమయపాలన పాటించకుండా మద్యం విక్రయాలు జరుపుతున్నారని ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం మద్యం దుకాణంలో విక్రయా లు మాత్రమే జరపాల్సి ఉండగా, అక్కడే మద్యం తాగేందుకు బార్ అండ్ రెస్టారెంట్‌ను తలపించేలా ఏర్పాట్లు చేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

తొలి రోజు ప్రశాంతం



బీ క్యాంప్ బాలికల హైస్కూల్ పది పరీక్ష కేంద్రం వద్ద కోలాహలం



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

పదోతరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. విద్యాశాఖ అధికారులు వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. తనిఖీలు చేసి విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించారు. కాగా నగరంలోని బీక్యాంపు గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, బీక్యాంప్ బాలుర హైస్కూల్, బాలికల హైస్కూల్‌లలో పరీక్ష రాసే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కేంద్రాల వద్ద సందడి కనిపించింది. ఆ దృశ్యాలివీ..

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



బిడ్డకు తోడుగా కేంద్రం వద్దకు..



బాలికల హైస్కూల్‌లో తనిఖీలు చేస్తున్న దృశ్యం



బీ క్యాంప్ బాలుర హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న, విద్యార్థులు, తల్లిదండ్రులు



ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను సోమవారం వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. క్యాలెండర్ సరళమైన భాషలో అందరికీ అర్థం అయ్యే విధంగా రూపొందించారన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు, కల్లూరు కమిటీ అధ్యక్షులు, సభ్యులు నాగయ్య, పురుషోత్తం, ఈశ్వరయ్య, అనిత, ఓబులేసు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు



ర్యాలీ చేస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

కల్లూరు: మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జీవితాలు చిత్తు అవుతాయని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ మంజులరాణి అన్నారు. సోమవారం సల్కాపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరమన్నారు. వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సర్పంచ్ మద్దిలేటి, విద్యార్థినులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వద్దు– జీవితమే ముద్దు, మాదకద్రవ్యాల దుర్వినియోగం ఆపండి అంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. నాయకులు దేవేందర్‌రెడ్డి, డాక్టర్ మనోజ్ కుమార్, ఎన్ఎస్ఎస్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

➤ చిన్నటేకూరు సమీపంలోని సీఈఎస్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చెట్లమల్లాపురం గ్రామంలో పర్యటించి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.